క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

నూతనకల్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఇందిర తెలిపారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరై సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు.

గ్రామపంచాయతీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సాంబిరెడ్డి

చివ్వెంల : మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామపంచాయతీ కార్యాలయాన్ని బుధవారం డీఎల్‌పీఓ సాంబిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించి పంచాయతీ సిబ్బంది వివరాలను కార్యదర్శి చలమయ్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం, పల్లె ప్రకృతి వనం, నర్సరీ నిర్వహణ, విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ బోయిళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని కాకతీయ హైస్కూల్‌కు చెందిన 115మంది విద్యార్థులు సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారు నిర్వహించిన మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో సెకండ్ లెవల్‌కు అర్హత సాధించినట్టు పాఠశాల చైర్మన్ గుండా హరినారాయణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన బత్తుల ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ బాణాల సుదర్శన్‌రెడ్డి బుధవారం రూ.80,116లు, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థికసాయం మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బత్తుల నాగమల్లు, భూదేవి మల్లయ్య, వేర్పుల సురేష్, శ్రీరాములు, రామచంద్రు, సతీష్, బత్తుల రవి, పులుసు సైదులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్తగూడెంలో పశు వైద్యశిబిరం

అర్వపల్లి: మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామపంచాయతీ ఆవాసం కొత్తగూడెంలో గురువారం పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్ బుధవారం తెలిపారు. అనారోగ్యం బారిన పడిన పశువులకు, ఎదకు రాని పశువులకు చికిత్స చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే దూడలకు నట్టల నివారణ మందులు వేయడం జరుగుతుందని తెలిపారు. ఎదకు వచ్చిన పశువులకు ఉచితంగా కృత్రిమ గర్భధారణ టీకాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీపీ పరామర్శ

అర్వపల్లి: తిమ్మాపురం పీఏసీఎస్ డైరెక్టర్ నూకల గురువయ్య తల్లి నూకల పున్నమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ నివాళులర్పించి ఆమె కుటుంబీకులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో దుబ్బాక ఎల్లంరాజు, మంగదుడ్ల మల్లయ్య, ఈర్ల కాశయ్య, ఎల్లెంల అవిలయ్య ఉన్నారు.

విద్య, వైద్య రంగానికి నిధులు కేటాయించాలి



సంతకాల సేకరణలో పాల్గొన్న న్యాయవాదులు

హుజూర్‌నగర్ : విద్య, వైద్య రంగానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని పలువురు న్యాయవాదులు అన్నారు. బుధవారం తెలంగాణ పవర్ స్పందన వేదిక ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదిక జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్, డివిజన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, న్యాయవాదులు సత్యనారాయణ, మాధవరెడ్డి, రవికుమార్, అంజయ్య, రమణారెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటేనా..!

- నిరుపయోగంగా 365బీ హైవే వెంట నిర్మించిన టాయిలెట్లు
- నిర్వహణ లోపంతో శిథిలావస్థకు..
- వినియోగంలోకి తేవాలంటున్న ప్రయాణికులు



365బీ హైవేపై జ్యోతులనగర్ వద్ద బస్‌బే వెంట నిరుపయోగంగా ఉన్న టాయిలెట్స్



మరుగుదొడ్డిలోని లోపలి భాగం

అర్వపల్లి: సూర్యాపేట–జనగామ 365బీ జాతీయ రహదారిపై బస్‌బేల వెంట నిర్మించిన టాయిలెట్లు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. వీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వృథాగా పడి ఉన్నాయి. కొన్నిచోట్ల భవనాలు శిథిలమై పోతున్నాయి. సూర్యాపేట నుంచి తిరుమలగిరి వరకు నాలుగేళ్ల కిందట మొత్తం 43కి.మీ రహదారిని రూ.170కోట్లతో విస్తరించారు. ఈ హైవే నిర్మాణంలో భాగంగా పలుచోట్ల బస్‌బేల వెంట నిర్మించిన టాయిలెట్లను పట్టించుకునే నాథలే లేకుండా పోయిరు. దీంతో ఈ హైవేపై ప్రయాణిస్తున్న వాహనదారులు వీటిని వినియోగించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఫలితంగా అత్యవసర సమయంలో రోడ్డు వెంటే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు.

కొద్ది రోజుల పాటే..

365బీ హైవే విస్తరణలో భాగంగా జ్యోతులనగర్, వేల్పుచెర్ల వద్ద బస్‌బేల వెంట టాయిలెట్ల నిర్మాణాన్ని చేపట్టారు. అయితే ఈ టాయిలెట్స్ కొద్ది రోజులపాటు మాత్రమే పనిచేశాయి. వీటిని బస్‌బేల దగ్గర వాహనాలు నిలుపుకునే వాహనదారులు, ఈ హైవేపై ప్రయాణించే ప్రయాణికులు వాడుకునే వారు. కానీ.. వీటి నిర్వహణ కొరవడటంతో కొంత కాలానికే నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా హైవే అధికారులు హైవేపై నిర్మించిన టాయిలెట్లను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

నిరుపయోగంగా మారాయి



365బీ హైవేపై రెండు చోట్ల నిర్మించిన టాయిలెట్లు నిరుపయోగంగా మారాయి. వీటిని నిర్వహణ చూసేవారు లేక శిథిలమై పోతున్నాయి. అలాగే మందుబాబులు వీటిలో కూర్చొని మద్యం సేవించి సీసాలు పగులగొట్టి వెళ్తున్నారు.

– వజ్జె సాయి, రామన్నగూడెం

మా దృష్టికి రాలేదు



365బీ హైవే విస్తరణలో భాగంగా ప్రయాణికులు, వాహనదారుల కోసం రెండు చోట్ల బస్‌బేల వద్ద టాయిలెట్లు నిర్మించాం. అయితే అవి నిరుపయోగంగా ఉన్న విషయం తమ దృష్టికి రాలేదు. వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– ప్రవీణ్‌రెడ్డి, హైవే డీఈఈ

బీఆర్‌ఎస్ పార్టీలో పలువురి చేరిక



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బొడ్డు రామలింగయ్య

అర్వపల్లి: రానున్న ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గంలో మళ్లీ బీఆర్‌ఎస్‌దే విజయమని, గాదరి కిశోర్‌కుమార్ మూడవ సారి ఎమ్మెల్యేగా గెలుపొందడం కావడం ఖాయమని అర్వపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ బొడ్డు రామలింగయ్య అన్నారు. బుధవారం కాసర్లపహాడ్ మాజీ సర్పంచ్ బందెల లక్ష్మీశంకర్ బీఆర్‌ఎస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి విజయ్, చెరుకు తిరుపతయ్య, ఇటికాల సాయిలు, వేముల గణేష్, ఉయ్యాల రాము, ఎస్‌ఎంసీ చైర్మన్ మచ్చ శ్రీను, రొయ్యల శ్రీను, మచ్చ మధు, మహేష్, పున్నయ్య పాల్గొన్నారు. అలాగు జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన పర్రెపాటి రాములు, పెద్ది నారాయణ, తాడూరి సోమయ్య, సయ్యద్ జహంగీర్, శిగ సందీప్, కొణతం జగన్నాథంతో పాటు కొంత మంది ఆపార్టీ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

వజ్రమ్మ మృతి తీరనిలోటు



వజ్రమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పట్టణ పరిధిలోని కుడకుడ గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు తల్లి కొలిశెట్టి వజ్రమ్మ మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం వజ్రమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె పార్థీవదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వేల్పుల వెంకన్న, జె.నరసింహరావు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బచ్చలకూరి రాంబాబు, కుడకుడ పార్టీ శాఖ కార్యదర్శి కంచుగట్ల శ్రీనివాస్, పార్టీ టూటౌన్ కమిటీ సభ్యురాలు పిండిగ నాగమణి తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో దోపిడీని అరికట్టాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాపంథా పార్టీ నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో మెడికల్ మాఫియాను, ప్రైవేట్ ఆస్పత్రుల్లో దోపిడీని అరికట్టాలని ప్రజాపంథా పార్టీ జిల్లా కన్వీనర్ కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ధర్నా నిర్వహించి కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కోదాడ, తిరుమలగిరి, సూర్యాపేట, హుజూర్‌నగర్ పట్టణాలలో ప్రైవేట్ ఆస్పత్రులు రోజురోజుకు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీకి అడ్డాలుగా మారాయని, అర్హత ఉన్నా, లేకున్నా ఆస్పత్రుల్లో ల్యాబ్‌లను, మెడికల్ షాపులను నడుపుతూ మెడికల్ మాఫియా దందా కొనసాగిస్తున్నారని అన్నారు. ఆర్‌ఎంపీలను, పీఆర్‌ఓలను ఏజెంట్లుగా పెట్టుకొని బిల్లులో 40శాతం కమీషన్లు ఇస్తూ పేద ప్రజలను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మాఫియాపై, ప్రైవేట్ ఆస్పత్రుల్లో దోపిడీపై కలెక్టర్ స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు మట్టిపల్లి అంజయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ రామోజీ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎర్ర అఖిల్, నాయకులు చంద్రకళ, జయమ్మ, లక్ష్మి, రాజేశ్వరి, పద్మ, నాగలక్ష్మి, వెంకన్న, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తుంగతుర్తి : పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించే విధంగా బీజేపీ నాయకులు కృషి చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులు మాదిగ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. 2014లో బీజేపీ అధికారంలోకి వస్తే 100రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి నేటికి అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా బీజేపీ జిల్లా, రాష్ట్ర, జాతీయ కమిటీలు పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లి ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న భాషాపండితులు

మద్దిరాల : మండల పరిధిలోని పోలుమల్ల ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ 2023 నూతన క్యాలెండర్‌ను ఆ సంఘం జిల్లా కోశాధికారి చిట్యాల ప్రదీప్‌కుమార్ బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. భాషాపండితులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం పదోన్నతులను కల్పించి మాట నిలబెట్టుకోవాలన్నారు. ఉన్నత పాఠశాలలో 6నుంచి 10వ తరగతి వరకు బోధన చేసినప్పటికి స్కూల్ అసిస్టెంట్ వేతనం ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని అన్నారు. భాషాపండితులకు పదోన్నతులు ఇచ్చిన తరువాతే ట్రాన్స్‌ఫర్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటయ్య, భాషాపండితులు మెంతబోయిన సైదులు, డి.అంజలి, ఉపాధ్యాయులు టి.పూర్ణచారి, సీహెచ్ వెంకన్న, కె.శ్రీలత, కోన వెంటేశ్వర్లు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, బయ్య దేవేందర్, చీమల ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం సభకు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు



సూర్యాపేట : బహిరంగ సభకు వెళ్తున్న బీఆర్‌ఎస్ పార్టీ మహిళలు, నాయకులు

తుంగతుర్తి : ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ బహిరంగ సభకు మండల నుంచి బుధవారం ఆ పార్టీ నాయకులు భారీగా తరలివెళ్లారు. వెళ్లిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, పార్టీ మండల అధ్యక్షుడు సీతయ్య, వైస్‌ఎంపీపీ శ్రీశైలం, రాములు, పరమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

నాగారం : ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ పార్టీ బహిరంగ సభకు మండల నుంచి బుధవారం ఆ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. వెళ్లిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, అంబయ్యగౌడ్, యాదగిరి, రాంరెడ్డి, బాలమల్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఖమ్మంలో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ బహిరంగ సభకు ఆ పార్టీ నాయకులు బుధవారం భారీగా తరలివెళ్లారు. వెళ్లిన వారిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్ రెడ్డి, ఎంపీపీ స్నేహలత, జెడ్పీటీసీ అంజలి, మాజీ ఎంపీపీ సతీష్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు ఉన్నారు.

సూర్యాపేట : ఖమ్మంలో నిర్వహించే బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు జిల్లా కేంద్రానికి చెందిన మహిళలు బుధవారం భారీగా తరలివెళ్లారు. వెళ్లిన వారిలో ఎస్.కె సల్మా మస్తాన్, దండు రేణుక, కరుణ శ్రీ, మహేశ్వరీ, మహిళలు తదితరులు ఉన్నారు.

మద్దిరాల : ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ పార్టీ బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఆ పార్టీ నాయకులు బుధవారం తరలివెళ్లారు.

నూతనకల్ : ఖమ్మంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు మండల కేంద్రంతో పాటు మండలం నుంచి కార్యకర్తలు, నాయకులు బుధవారం తరలివెళ్లారు. వారిలో ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్లయ్య, రమామల్లారెడ్డి ఉన్నారు.

అర్వపల్లి : ఖమ్మంలో నిర్వహించే బీఆర్‌ఎస్ సభకు మండలం నుంచి ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ భవానీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తరలివెళ్లారు.

పెన్‌పహాడ్ : మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం పార్టీ సభకు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య, పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, పీఏసీఎస్ చైర్మన్‌లు జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, సీతారాంరెడ్డి ఉన్నారు.

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఖమ్మంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో ఎంపీపీ ధరావత్ కుమారీబాబునాయక్, జెడ్పీటీసీ భూక్య సంజీవ్‌నాయక్, జీవన్‌రెడ్డి, నర్సింహారావు, పీఏసీఎస్ చైర్మన్ సుధీర్‌రావు, వెంకటేశ్వర్లు యాదవ్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ‘కంటి వెలుగు’ శిబిరాలు



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, అధికారులు



మద్దిరాలలో కంటివెలుగు ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్



చివ్వెంల : మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో గురువారం నుంచి మొదలయ్యే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ పి.విజయ తెలిపారు. గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేస్తున్న శిబిరం ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 18రోజుల పాటు ఈ గ్రామపంచాయతీ పరిధిలో కంటి పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ సందీప్‌కుమార్, సబ్ యూనిట్ అధికారి బి.నర్సయ్య, కంటి వెలుగు వైద్యాధికారి డాక్టర్ చినపాక మణిరత్నం, సీహెచ్‌ఓ ఎల్.చరణ్, కార్యదర్శులు నెహ్రూ, ఉపేందర్‌రావ్, హెల్త్ అసిస్టెంట్‌లు వీరయ్య, సైదులు, వేణు, సైదమ్మ, శకుంతల, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు మండల వైద్యాధికారిగా మణిరత్నం

కంటి వెలుగు కార్యక్రమ మండల వైద్యాధికారిగా డాక్టర్ చినపాక మణిరత్నం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం సూర్యాపేట మండలం బాలెంల పల్లె దవాఖాన వైద్యుడిగా పనిచేస్తూ మండలంలో కంటి వెలుగు కార్యక్రమం డాక్టర్‌గా నియమితులయ్యారు. కంటి వెలుగు కార్యక్రమం పూర్తయ్యే వరకు ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

మద్దిరాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను స్థానిక తహసీల్దార్ అమీన్‌సింగ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట వైద్యసిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల పరిధిలోని తూర్పుగూడెం గ్రామంలో గురువారం నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లను బుధవారం వైద్యాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ మాట్లాడుతూ.. ప్రజలందరికి కంటి వైద్యం అందుబాటులోకి తీసుకరావడానికి ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ శిబిరంలో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి అనంతరం ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి కంటి వెలుగుపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతిఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగునాయక్, హెచ్‌ఈఓ సముద్రాల సూరి, పీహెచ్ ఎస్ సైదమ్మ, కార్యదర్శి నవీన్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుపై అవగాహన ర్యాలీ

చివ్వెంల : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కంటి సమస్యలు ఉన్న వారు పీహెచ్‌సీ ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజ్‌కుమార్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జూలకంటి సుధాకర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు శేషయ్య, శిరోమణి, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనాజిపురంలో గురువారం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కంటి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమ ప్రారంభానికి ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య హాజరవుతున్నట్లు తెలిపారు.

నాగారం : మండల కేంద్రంలో నేడు కంటి వెలుగు వైద్యశిబిరం ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ జి.శోభారాణి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటివెలుగుపై మండల స్థాయి అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించి, కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య శిబిరంలో ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేస్తారని తెలిపారు. కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో డాక్టర్ హర్షవర్ధన్, ఎంపీఓ దార శ్రీనివాస్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని జల్మాలకుంట, అనాజిపురం గ్రామాల్లోని కంటి వెలుగు కేంద్రాలను బుధవారం డిప్యూటీ డెమో అధికారి అంజయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఎంపీఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నాగారంలో కంటి వెలుగుపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ



తుంగతుర్తి : తూర్పుగూడెంలో కంటివెలుగు ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

బీఆర్‌ఎస్ వైఫల్యాలను తెలిపేందుకే పాదయాత్ర

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి



సూర్యాపేటరూరల్ : బీఆర్‌ఎస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు తెలుపుతున్న పటేల్ రమేష్‌రెడ్డి



అర్వపల్లి : పూజలు చేస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

సూర్యాపేట రూరల్ : గడపగడపకు బీఆర్‌ఎస్ పార్టీ వైఫల్యాలను తెలిపేందుకే పాదయాత్ర చేపడుతున్నట్లు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సోలిపేట గ్రామంలో హత్ సే జోడో యాత్రలో భాగంగా ఆయన పాదయాత్ర ప్రారంభించారు. మొదటి రోజు సోలిపేట, రామచంద్రపురం, రత్నపురం గ్రామాల మీదుగా 15కిలోమీటర్లు సాగి అర్ధరాత్రి రామారం గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు వీఆర్‌ఎస్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఎన్నికలు వస్తే బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు డబ్బుల సంచులతో ప్రజల వద్దకు వస్తున్నారని, వారిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రజలకు సేవ చేయడానికి తనరక్తపు చివరి బొట్టు వరకు ముందుంటానని అన్నారు. బంగారు తెలంగాణ పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ఆయన కుటుంబమే బంగారు తెలంగాణగా మారిందని, అదేవిధంగా మంత్రి జగదీశ్ రెడ్డి కుటుంబం బంగారు తెలంగాణగా మారిందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో సూర్యాపేటలో గెలిచేది కాంగ్రెస్ పార్టీయేనని, సోలిపేట నుంచే బీఆర్‌ఎస్ పార్టీ పతనానికి నాంది పలకబోతుందని, సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీకి 50వేల మెజార్టీ దక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధి కోసం పాదయాత్రలు చేపట్టలేదని, కేవలం ప్రజల కోసమే పాదయాత్రలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఆయన సతీమణి మాజీ జెడ్పీటీసీ పటేల్ లావణ్య, నాయకులు గట్టు శ్రీను, పాలవరపు వేణు, గట్టు జ్యోతి, షఫీఉల్లా, వెలుగు వెంకన్న, ఎడ్ల గంగాభవానీ వీరమల్లుయాదవ్, నామా అరుణప్రవీణ్, గోపాల్‌రెడ్డి, ధరావత్ వెంకన్ననాయక్, వల్దాసు దేవేందర్, రామసాని రమేష్‌నాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, తీగల వేణుమాధవ్, స్వామినాయుడు, సైదిరెడ్డి, ఆయా గ్రామాల ప్రజలు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో పూజలు

అర్వపల్లి: తిమ్మాపురంలోని సూర్యక్షేత్రాన్ని బుధవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్షేత్రంలో పూజలు చేసిన అనంతరం సోలిపేట మీదుగా సూర్యాపేట నియోజకవర్గంలో మహాపాదయాత్రను చేపడుతున్నట్లు చెప్పారు. సూర్యాపేట ప్రజల సమస్యల పరిష్కారానికే పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షఫిఉల్లా, వెలుగు వెంకన్న, రమణారెడ్డి, గోదల రంగారెడ్డి, సైదిరెడ్డి, శ్రీనివాస్, రమేష్‌నాయుడు, ప్రవీణ్, ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

గరిడేపల్లి : త్వరలో జరగబోయే ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా జరగాలని, 317 జీఓ బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని ఎస్‌టీయూ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి నాగేశ్వర్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. నూతన జిల్లాల ఏర్పాటు తరువాత కేడర్ స్ట్రెంత్ విభజనలో భాగంగా జిల్లా స్థానికతను చూడకుండా వందల సంఖ్యలో జూనియర్ ఉపాధ్యాయులను తమ అభీష్టానానికి భిన్నంగా బదిలీలు చేశారని, ప్రస్తుతం బదిలీల ప్రక్రియలో వారికి తగిన విధంగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజన శక్తి రాష్ట్ర కోఆర్డినేటర్‌గా శివకుమార్

మోతె : గిరిజన శక్తి రాష్ట్ర కోఆర్డినేటర్‌గా మండలంలోని లాల్‌తండా గ్రామానికి చెందిన డాక్టర్ శివకుమార్‌నాయక్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్ నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం శివకుమార్ విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనుల సమస్యలపై పోరాడుతానని, ట్రైబల్ యూనివర్సిటీ, గిరిజన బంధు సాధనను కృషి చేస్తానని తెలిపారు. మండలంలో ప్రతి తండా నుంచి గిరిజన శక్తి సంఘాన్ని ఏర్పాటు చేస్తానన్నారు.